



కల్యాణం.. కమనీయం...



కల్యాణోత్సవంలో చంద్రబాబు దంపతులు

భక్తులతో కిక్కిరిసిపోయిన కల్యాణ వేదిక ప్రాంగణం

సీతారాముల కల్యాణఘట్టం

- పండువెన్నెల్లో అంగరంగ వైభవంగా జరిగిన సీతారాముల కల్యాణం
- లక్షలాదిగా హాజరైన భక్తులు..
- పులకించిన కల్యాణ ప్రాంగణం
- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకొచ్చిన సీఎం చంద్రబాబు
- అధికారుల సమిష్టి కృషితో కల్యాణోత్సవం విజయవంతం

రాజంపేట/ఒంటిమిట్ట/కడప, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : నెలరాజు పండు వెన్నెల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారామ కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామ భక్తుల రామనామ సంకీర్తనలు, పండితుల చతుర్వేద పఠనం.. మంగళవాయిద్యాల నడుమ.. శుక్రవారం రాత్రి 8.10 గంటలకు విశ్వావసు నామ సంవత్సర ఉత్తరాయణ, చైత్రమాస శుక్లపక్ష చతుర్ధశి, హస్తా నక్షత్ర ప్రయుక్త తులాలగ్న శుభ ముహూర్తంలో దశరధమహారాజు తనయుడు, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకులు శ్రీరామ చంద్రమూర్తి, అఖిల జగన్మాత శ్రీ జనక మహారాజ పుత్రిక సీతమ్మను పరిణయమాడారు. రమణీయం.. కమనీయమైన ఈ సుందర దృశ్యాన్ని తిలకించిన భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. లోకకల్యాణార్ధం.. జగమేలే వైకుంఠ రాముడి జగత్ కల్యాణం ఆంధ్రాభద్రాద్రి ఏకశిలానగిరి ఒంటిమిట్ట జగదభిరాముడి దివ్యక్షేత్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం అధ్వర్యంలో నభూతో నభవిష్యతే అన్న రీతిలో జరిగింది. కోదండరామయ్య సీతమ్మ వారిని పరిణయమాడిన వేళ శిల్పకళా శోభితమైన కల్యాణ మండపం వైకుంఠాన్ని తలపించింది. ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సీఎం సతీమణి నారా భువనేశ్వరి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను స్వామి వారికి సమర్పించారు.

కనులపండువగా కల్యాణం

ఒంటిమిట్ట కోదండరామాలయంలో శుక్రవారం రాత్రి కోదండరాముని కల్యాణ వేడుకను వేదపండితులు వేదమంత్రాల మధ్య నిర్వహించారు. మొదటిగా సీతారామచంద్రులకు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలు, టీటీడీ అందించిన

- మిగతా 6వ పేజీలో



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకువస్తున్న సీఎం దంపతులు



పట్టువస్త్రాలు అందచేస్తున్న సీఎం చంద్రబాబు



చంద్రబాబు దంపతులకు ప్రసాదం అందచేస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు





స్వామి, అమ్మవార్లను కల్యాణ వేదిక వద్దకు తెస్తున్న దృశ్యం



యజ్ఞోపవీతధారణ



కల్యాణం అనంతరం మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

జ్యోతిరావు పూలే అడుగుజాడలే ఆదర్శం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్) / టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావుపూలే అడుగు జాడలే స్ఫూర్తిగా పయనిద్దామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి చిత్రపటానికి కలెక్టర్, జేసీ, డీఆర్‌వో, అధికారులు, వివిధ బీసీ సంఘ నాయకులు, ప్రతినిధులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం స్త్రీ విద్యకు పాటుపడిన గొప్ప సంస్కర్త, స్వయంగా తన భార్యకు చదువు చెప్పించి టీచర్‌గా పనిచేయించి బాలికల విద్యకు కృషి చేశారని తెలిపారు. బాల్యవివాహాల నిర్మూలనకు మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి నిమిత్తం 707 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు చొప్పున మొత్తం రూ.14.14 కోట్ల రాయితీ మెగా చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖాధికారి సురేశ్‌కుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీఎస్ జయసింహా, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





మహాత్మా జ్యోతిరావు పూలేకి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్, జిల్లా పోలీసు కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

గొప్ప భారతీయ సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జ్యోతిరావుపూలే గొప్ప భారతీయ సంఘ సంస్కర్త అని, విద్య అనేది అందరికీ అందుబాటులో ఉండాలన్న మహనీయుడన్నారు. ఆయన చేసిన కృషి ఫలితంగానే ప్రభుత్వం వ్యవసాయ చట్టంను ఆమోదించిందన్నారు. ఇలాంటి మహనీయుల అడుగు జాడల్లో నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.వెంకటాద్రి, ఏవో బి.కృష్ణుడు, ఆర్‌ఐ ఎం.పెద్దయ్య, సీసీఎస్ ఎస్‌ఐ రామక్రిష్ణారెడ్డి, ఆర్‌ఎస్ ఐలు అమర్‌నాధరెడ్డి, రవి, డీపీవో సిబ్బంది, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హంస వాహనంపై పట్టాభిరాముడు

- వేడుకగా వసంతోత్సవం

వాల్మీకిపురం, ఏప్రిల్ 11: వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి వారికి చక్రస్నానం వైభవంగా జరిగింది. ఉదయం సుప్రభాత సేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం తిరుచ్చిలో సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాములను అలంకరించి తిరుమాడ వీధులలో ఊరేగిస్తూ శ్రీరామ భక్తుల వసంతోత్సవ వేడుకలు ఎంతో వైభవంగా సాగాయి. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కొద్దిరోజుల క్రితం ప్రచురితమైన కథనంపై టీడీపీ అధికారులు స్పందించారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో నిర్వహించే చక్రస్నాన ఘట్టం ఈ ఏడాది గరుడ పుష్కరిణిలో నిర్వహించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. విశేష భక్తజనం నడుమ చక్రస్నానం కన్నుల పండువగా సాగింది. రాత్రి సీతారామలక్ష్మణులను హంసవాహనంపై అధిష్టింపచేసి తిరుమాడ వీధులలో ఊరేగించారు. రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామి వారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్‌భట్టార్, కృష్ణరాజు,సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరి రోజున శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం పట్టాభిరాముడికి పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి.



వాల్మీకిపురం గరుడ పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తున్న వేదపండితులు



హంస వాహనంపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడి నగరోత్సవం






సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి దంపతులు






ఎదుర్కోలు దృశ్యం

కల్యాణం.. కమనీయం..

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఉత్సవరులను పల్లకీపై కొలువు దీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తుల శ్రీరామ.. జయజయరామ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. వేదికపైన రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనులు చేసిన అనంతరం పూజా సామాగ్రికి సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు, ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనపూజ జరిపించారు. కర్మణ్యే పుణ్యాహవచనం అనే మంత్రంతో మంటపశుద్ధి జరిపి కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ముంజానికీ ప్రధమం అనే మంత్రం చదువుతూ రామయ్యను సీతమ్మను ఎదురెదురుగా కూర్చొండబెట్టి కన్యావరణం జరిపించారు. మోక్ష బంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణయజ్ఞోపవీత ధారణం చేసిన అనంతరం ఆశీర్వచనం, ప్రాధప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ జరిపించారు.. మధుపర్కపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించాక నునుసిగ్గుల మొలక అయిన సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్పించిన పట్టు వస్త్రాలు సమర్పించి పెళ్లికూతురుగా అందంగా ముస్తాబు చేశారు. ఆమెకు ఏమాత్రం తీసిపోని విధంగా శివధనస్సు విరిచిన శ్రీరామ చంద్రమూర్తి అదే రీతిలో సీతమ్మ ఎదుట కూర్చొన్నాడు. తరువాత లోక క్షేమం కోసం మహాసంకల్పం పఠించి కన్యాదానం, గోదానం, భూదానం జరిపించారు. సీతమ్మకు, రామయ్యకు ఒక్కొక్కరికీ 8 శ్లోకాలతో మంగళకాష్టం చదివారు. మంగళవాయిద్యాలు.. వేదపండితుల చతుర్వేద పఠనం.. భక్తుల రామనామ ధ్వనుల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరీ దేవి, సరస్వతిదేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆవాహనం చేసి సకలమంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజ చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తు లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత మహాలక్ష్మి స్వరూపిణి సీతామహాదేవికి 8.10 గంటలకు శాస్త్రోక్తంగా మంగళసూత్రాధారణ జరిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సులపై పోసి కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహదాశీర్వచనం నిర్వహించారు. హారతి ఇవ్వడంతో సీతారాముల కల్యాణ క్రతువు ముగిసింది. ఈ సందర్భంగా కల్యాణ వేదిక ప్రాంగణం చుట్టూ వైకుంఠాన్ని తలపించే విద్యుత్ దీప కాంతులు, వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు కల్యాణోత్సవానికి మరింత శోభను తెచ్చిపెట్టాయి. కల్యాణోత్సవాన్ని భక్తులు దగ్గరగా తిలకించేందుకు వీలుగా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌లు, ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏసీలు, కూలర్‌లను కల్యాణ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవానికి అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్ష మందికి పైగా భక్తులు వీక్షించి ముగ్ధులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి భక్తుడికి మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను అందజేశారు.

రామ నామస్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి సాయంత్రానికే కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఎటుచూసినా భక్తుల శ్రీరామనామంతో కల్యాణ ప్రాంగణం మార్మోగింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు, ఇతర వాహనాల్లో భారీ ఎత్తున ఒంటిమిట్టకు తరలివచ్చారు. జనసంద్రంతో కల్యాణవేదిక కిటకిటలాడిపోయింది. ఇటు చెన్నై, అటు కడప ప్రధాన రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడిపోయాయి. ఎటుచూసినా వాహనాలు కిక్కిరిసిపోయాయి. నేల ఈనిందా అన్న రీతిలో కోదండరాముడి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఓ రామా.. నీ నామమెంతో రుచిరా.. రామా.. రామా.. రామా.. అన్న రీతిలో జనసంద్రం తరలివచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానం అంతా టీటీడీ చైర్మన్ బీ ఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ ఆగమశాస్త్ర పండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్, పురోహితులు భారీ ఎత్తున తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం కనీవిని ఎరుగని రీతిలో శ్రీవారి సేవకులను ఉపయోగించి భారీ ఎత్తున కల్యాణోత్సవ ఏర్పాట్లను చేశారు.


అలరించిన సంకీర్తనలు

ఒంటిమిట్ట సీతరాముల కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం కల్యాణవేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన, కళాశాల విద్యార్థులు ఆలపించిన సంకీర్తలు భక్తులను మైమరిపించాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన రామ రామా.. రఘురామా... పరమాత్మరా... పాహి కల్యాణ రామ పావన గుణరామా... ఎక్కడ చూసినా మన శ్రీరాముడే... తదితర సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

సీతారాములకు శ్రీవారి కానుక

కల్యాణం సందర్భంగా తిరుమల నుంచి వేంకటేశ్వర స్వామి శుక్రవారం కానుకలు పంపారు. కల్యాణానికి స్వర్ణ కిరీటం, యజ్ఞోపవీతం ఆభరణాలను కానుకగా అందించారు. టీటీడీ ఆనవాయితీలో భాగంగా శుక్రవారం ఈ ఆభరణాలను సమర్పించారు. ఆలయం ముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ఆభరణాలకు పూజలు చేసి కోదండరామునికి అందజేశారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎం సతీమణి నారా భువనేశ్వరి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కడప ఇన్‌చార్జి మంత్రి సవిత, రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, టీటీడీ ఈవో శ్యామలరావు, కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కడప ఎస్పీ అశోక్‌కుమార్, అన్నమయ్య ఎస్పీ విద్యాసగర్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలతో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.


కోదండరాముడి ఊరేగింపు దృశ్యం







వ్యక్తి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు


అదృశ్యమైన శంకర్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామసముద్రం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మూగవాడి గ్రామానికి చెందిన జి.శంకర్‌రెడ్డి పుంగనూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో వ్యక్తిగత అవసరాల కోసం కొంత డబ్బు రుణం తీసుకున్నాడు. అయితే డబ్బు తిరిగి వసూలు చేసే క్రమంలో బ్యాంకు అధికారుల వేధింపులు తాళలేక శంకర్‌రెడ్డి ఈనెల 10న అదృశ్యమయ్యారు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు శుక్రవారం రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దారి విషయమై ఘర్షణ.. గాయపడిన మహిళ

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి గోడ దారి విషయమై శుక్రవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, అదే గ్రామానికి చెందిన మహిళపై దాడి చేశారు. ఈ సంఘటనలో రాజేశ్వరి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం చియ్యవరం గ్రామానికి చెందిన రాజేశ్వరి, బాలు విజయ కుమారి మధ్య ఇంటి దారి విషయంలో వివాదం తలెత్తింది. ఈ వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో విజయకుమారి భర్త బాలు మల్లికార్జున, మరో ఇద్దరు రాజేశ్వరిపై దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని మదనపల్లె పట్టణం శేషమహల్ ఏరియాకు చెందిన సందీప్ అనే యువకుడు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వన్‌టౌన్ సీఐ ఎరిసావలి తెలిపారు. గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపికైన వీఆర్‌డీఎస్ సంస్థ

వీరబల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోమలరాజు శివరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని చిత్తూరు పట్టణంలోని విజయం ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది వివిధ విభాగాల్లో సేవలందించిన సేవా ప్రతినిధులకు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి వీఆర్‌డీఎస్ సంస్థకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకునేందుకు వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ అధ్యక్షులు సురేంద్రారెడ్డిని ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సేవా ప్రతినిధులు, ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సురేంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఓటర్లకు అనుకూలంగా
పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓటర్లకు అనుకూలంగా వుండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ (ఈఆర్‌వో) మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఏఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నివాస ప్రాంతాలకు 2 కి.మీ. పరిధిలోనే పోలింగ్ కేంద్రం వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా వున్న బీఎల్‌వో, బీఎల్ఏ స్థానాలను భర్తీ చేయాలన్నారు. ఓటరు కార్డులను ఆన్‌లైన్‌లో చెక్‌చేసి, తప్పులు, డబుల్ ఎంట్రీలు, ఫోటోలు మారి వుంటే సరిచేయాలని సూచించారు. సీపీఎం ప్రతినిధి శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలోని 98వ పోలింగ్ కేంద్రం నుంచి 145 పోలింగ్ కేంద్రం వరకు ఒకే ఇంటిలోని ఓటర్లను పలు పోలింగ్ కేంద్రాలకు కేటాయించారని, అలా కాకుండా ఒక ఇంట్లోని ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలో వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నిమ్మనపల్లె తహసీల్దార్ అమరనాథ్, డీఏవో రాఘవేంద్ర, టీపీవో జకీరాబేగం, రాజకీయపార్టీల ప్రతినిధులు బాలుస్వామి, రెడ్డిసాహెబ్, భగవాన్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును
కేంద్రం వెనక్కితీసుకోవాలి

● ముస్లింల డిమాండు ● మద్దతు పలికిన రాజకీయ పార్టీలు


సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లింలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నమాజ్ అనంతరం పెద్ద సంఖ్యలో ముస్లింలు స్థానిక బెంగళూరు బస్టాండ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఇందుకు కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, బాస్ నాయకులు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, టూటౌన్ సీఐ రామచంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, తమ సిబ్బందితో ర్యాలీని ఆపడానికి ప్రయత్నించడంతో ముస్లింలకు, పోలీసులకు తోపులాట జరిగింది. ర్యాలీకి జెండాలు, డీజేల వాడకం నిషేధమని, కొందరు మాత్రమే వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించవచ్చని తెలిపారు. పట్టించుకోని ముస్లిం యువత బారికేడ్లను తొక్కుకుంటూ ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అర్ధగంట తరువాత ఆందోళన విరమించారు.

కార్యక్రమంలో బాస్ నేత పీటీఎం శివప్రసాద్, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిసార్‌అహ్మద్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, భారతీయ సేన అధ్యక్షుడు శ్రీచందు, ముస్లింలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

గురవయ్యపై వైసీపీ నేత కుమారుడు హత్యాయత్నం

వేముల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేత వర్ర రవీంద్రనాథరెడ్డి కుమారుడు వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి తన కుమారుడు గురవయ్యపై హత్యాయత్నం చేసినట్లు షేక్షావలి తెలిపారు. షేక్షావలి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో గురవయ్య తుమ్మలపల్లెలోని తన నివాసం వద్ద ఉండగా కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి వచ్చి తాను వేముల కానిస్టేబుల్‌నని, నీ మీద ఫిర్యాదు వచ్చింది స్టేషన్‌కు రా అని బైక్‌పై తీసుకెళ్లి పులివెందుల-కడప ప్రధాన రహదారిలోని కుప్పగుట్టపల్లె వరకు బైకులో తీసుకెళ్లి మా నాయనను తిడతావా అంటూ బూతులు తిడుతూ రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు తన కుమారుడు తెలిపాడని షేక్షావలి పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న గురవయ్య భార్య మరికొందరితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించినట్లు షేక్షావలి తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చికిత్స పొందుతున్న గురవయ్య

ఆలస్యంగా నడిచిన నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

● మూడున్నర గంటలకుపైగా ఆలస్యంతో ప్రయాణికుల అవస్థలు



ములకలచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. మూడున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ జంక్షన్‌లో ఇంజన్ మొరాయించడంతో రైలు ఆలస్యంగా నడిచిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 10.30 గంటలకు వచ్చింది. అలాగే పీలేరుకు ఉదయం 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 9.07 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడిగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మల్లిక


నియామక పత్రం అందుకుంటున్న మల్లిక

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జనసేన వీర మహిళ మల్లికను నియమించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి పదవి ఇచ్చిన ఆర్.కృష్ణయ్య, జనసేన నాయకులు, వీరమహిళలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు దారం అనిత, టీడీపీ నేత బిల్లేరెడ్డిప్రసాద్, రమణ, రూప, సిద్దయ్య, కళావ్యణి, రేఖా, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి ఊరేగింపులో ఘర్షణ

● ఇరువురికి గాయాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెన్నరాజుపోడు గ్రామంలో బుధవారం రాత్రి ప్రశాంతంగా శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఊరేగింపు జరుగుతుండగా పత్తి రాజేశ్వరి ఆమె భర్త సుబ్బరాయుడు తదితరులపై అదే గ్రామానికి చెందిన జోగినేని మణి (అలియాస్ చిన్న మణి) తన అనుచరులతో దాడి చేసినట్లు రాజేశ్వరి శుక్రవారం ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. పత్తి రాజేశ్వరి చెన్నరాజుపోడు గ్రామంలో నివాసముంటున్నారు. ఆమె భర్త సుబ్బరాయుడు కువైత్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ఓ వివాహం ఉన్న కారణంగా వచ్చిన సుబ్బరాయుడు చెన్నరాజుపోడులో కోదండరాముని ఊరేగింపును చూసుకునేందుకు చిన్నరాజుపోడుకు వచ్చారు. ఈ ఊరేగింపులో భార్యాభర్తలపై జోగినేని మణి దాడి చేశాడని తెలిపారు. దీంతో సుబ్బరాయుడు, రాజేశ్వరిలకు గాయాలయ్యాయని, కువైట్‌లో శెలవు లేనందున తిరుపతిలో వివాహం చూసుకుని తన భర్త కువైట్‌కు వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.


ఫిర్యాదు చేయడానికి వచ్చిన రాజేశ్వరి

రెవెన్యూ అధికారులకు జరిమానా

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో అనర్హులకు ఇళ్ల పట్టాలు జారీ చేశారన్న అభియోగాలపై ఇద్దరు రెవెన్యూ అధికారులకు జరిమానా విధిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టిన కలెక్టరు 2018 ఆగస్టు 18న ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. అప్పట్లో పులివెందుల తహసీల్దారుగా పనిచేసిన ఎల్.వి.ప్రసాద్ (ప్రస్తుతం రిటైరయ్యారు), ఏఆర్ఐ ఎ.సుజీత్‌కుమార్‌లను బాధ్యులుగా తేల్చారు. అనంతరం దీనిపై విచారణ జరపడానికి జాయింట్ కలెక్టరు-2ను నియమించారు. విచారణ అనంతరం 2020 మే 27 జాయింట్ కలెక్టర్-2 అక్రమాలపై ఇరువురినీ బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికను ప్రభుత్వానికి పంపారు. అనర్హులకు పట్టాలివ్వడంలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి తహసీల్దారు ఎల్.వి.ప్రసాద్ నెల వారీ పింఛనులో 6 శాతం కోత, ఏఆర్ఐ సుజిత్‌కుమార్ ఒక వార్షిక పింఛను నిలుపుదల చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

డీఎల్డీవోగా వెంకటనారాయణ

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ డీఎల్డీవోగా జి.వెంకటనారాయణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈయన తిరుపతి తుడా కార్యదర్శిగా డెప్యుటేషన్‌లో పనిచేస్తుండగా కడప డీఎల్డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్నాళ్లీ.. నిరీక్షణ

● రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు ● సచివాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు



పులివెందుల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమందించే సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్‌కార్డుల కోసం నిరుపేద కుటుంబాలు ఎదురు చూపులు చూస్తున్నారు. వైసీపీ అధి కారంలో ఉండగా పులివెందుల నియోజకవర్గం పరిధిలో తూతూ మంత్రంగా కొంత మందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల చేత రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగలేదు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెల ల తరువాత కొత్తకార్డులు ఇస్తామని చెబుతూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్‌కార్డు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకనుగుణంగా కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు చేర్పులు మార్పులకు అవకాశమిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతుంది. విషయం తెలియని ప్రజలు రేషన్‌కార్డుల కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు.

2023 నుంచి నూతనంగా వివాహాలు జరుపుకున్నవారు తప్పు ఒప్పులు, మార్పులు చేర్పులు, నూతనగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక తంటాలు పడుతు న్నారు. అలాగే రేషన్‌కార్డు లేక సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషనుకార్డే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తవి కోరుతూ మండ లం, ఆర్డీవో, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్‌కార్డులు చేర్పు లు మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అటు తహసీల్దరు, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలో ప్రకటన వస్తుం దని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమ స్యను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా

సుమారు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. నాకు ఇద్దరు పిల్లలు సంతానం. రోజువారి కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రేషన్‌కార్డు కోసం అన్ని చోట్ల తిరుగుతున్నాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు రేషన్‌కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

- మమత, పులివెందుల

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం.

నాకు నాలుగేళ్ల కిందట వివాహమైంది, ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. రేషన్‌కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. అత్యవసర వైద్యసేవలు పొందాలన్నా ఆరోగ్యశ్రీ లేదు. అధికారులు తమ గోడు పట్టించుకుని రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

- వెంకటలక్షుమ్మ, పులివెందుల

సైట్ ఓపెన్ కాగానే కార్డులు మంజూరు చేస్తాం



రేషన్‌కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. కార్డులకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తాం. ఈ క్రమంలో అప్‌డేట్ జరగ్గానే అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం.

- చిన్నయ్య, ఆర్డీవో, పులివెందుల

క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వైవీయూ ఎంబీఏ శాఖ అధిపతి డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో రిలయన్స్ రిటైల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏటా రూ.2.75 లక్షల వేతనం, పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పలు సౌకర్యాలను సంస్థ కలిస్తుందని రిలయన్స్ లిమిటెడ్ మేనేజర్ భానుప్రకాష్ తెలిపారు. డీన్ వై.సుబ్బరాయుడు ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బి.గంగయ్య మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంబీఏ శాఖ అధిపతి డా క్టర్ పి.సరిత మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ ఎంపికలకు రావడం పట్ల హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.సుమన్, ఎన్.మాధవి, ఎంబీఏ సహ ఆచార్యులు డాక్టర్ వరప్రభాకర్, అధ్యాపకులు పి.రాజశేఖర్, అనిల్ దేవకుమార్, సుధీర్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరాముడు

సింహాద్రిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు-బలపనూరు గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ వెంకటరాముడు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు వెంకటరాముడు అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందినవాడు. వెంకటరాముడు కూలి పనులు చేసుకుని తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో పులివెందులలో అరటి గెలలు కోత పనులు చేస్తూ శుక్రవారం పులివెందుల నుంచి తన స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

బాలల సంక్షేమ సమితిలో ఇద్దరు చిన్నారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని పిల్లలను ఐసీడీఎస్ అధికారులు బాలల సంక్షేమ సమితిలో ఉంచారు. ఐసీడీఎస్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మాస్టర్ సాకేత్ (మూడేళ్లు), మల్లి (రెండేళ్లు) అనే ఇద్దరు పిల్లలు కడప రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్, మహిళా పోలీస్ వెళ్లి ఆ ఇద్దరు పిల్లలను తీసుకొని కడపలోని బాలలసంక్షేమ సమితికి అప్పగించినట్లు చెప్పారు. ప్రస్తుతం సాకేత్, మల్లి మగపిల్లలు. ప్రత్యేక దత్తత సంస్థ, జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ కడపలో ఉంచినట్లు చెప్పారు. ఆ పిల్లల తల్లిదండ్రులు కానీ ఇతర కుటుంబ సభ్యులు ఎవరైన ఉంటే బాలల సంక్షేమ సమితి కడప వారిని సంప్రదించాలని కోరారు.

35 బస్తాల బియ్యం స్వాధీనం

దువ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరులో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు సీఎస్‌డీటీ మల్లికార్జున, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సంయుక్త దాడిలో సుమారు రూ.80,500 విలువ గల 35 బస్తాలు స్వాధీనం చేసుకుని సుబ్రమణ్యం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా ద్వారా దువ్వూరు పోలీసులకు నిందితుడిని అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణం సీజ్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం శీలంవారిపల్లెలోని చౌకదుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 4897 కేజీల రేషన్ బియ్యం, 128 కేజీల చక్కెర తక్కువ ఉండటంతో షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ రెడ్డి, ఏడీఐ లక్ష్మీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన అర్హులైన యువకులు స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 828 యూనిట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. 34.40 కోట్ల రుణాలు అందజేయడం జరుగుతుందని, రూ.13.57కోట్లు సబ్సిడీ,రూ.1.72కోట్ల లబ్దిదారు వాటా, రూ.19.12కోట్లు బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. అర్హులైన కులాలకు చెందిన వారు ఈనెల 14 నుంచి వచ్చే నెల 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

చిన్నారుల ఉసురు తీసిన నీటికుంట



యశ్వంత్, విజయ్, చొక్కరాజు దేవాన్ష్‌ల మృతదేహాలు

చిట్వేలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారులంతా బంధువులు. సరదాగా ఆడుకోవడానికి నీటికుంట వద్దకు వెళ్లి ఆ కుంటలోనే మునిగి ముగ్గురు అసువులు బాశారు. ఈ విషాదకర సంఘటన చిట్వేలి మండలంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎం.రాచపల్లెలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న నీటికుంటలో చొక్కరాజు దేవాన్ష్ (5), చొక్కరాజు విజయ్ (4), రెడ్డిచర్ల యశ్వంత్ (5) ముగ్గురు చిన్నారులు కుంటలోకి దిగి ఆడుకోవడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు అందులో ఉన్న నీటిలో పడి మృతి చెందారు. చిన్నారుల ఆచూకీ కోసం వెతుకుతుండగా కుంటలో విగత జీవులుగా పడి ఉన్న ముగ్గురు చిన్నారులను గ్రామస్థులు హుటాహుటిన చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, వీఆర్వో భుజంగరావు, వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

వంటగ్యాస్ సిలిండర్లకు వర్ధంతి : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50 పెంచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యాస్ సిలిండర్లకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లకు పూలమాల వేసి నిరసన తెలిపారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ.410 ఉండేదని, బీజేపీ పాలనలో పలుమార్లు ధర పెంచి రూ.853 చేశారని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై అనుచత వ్యాఖ్యలు చేసిన టీడీపీకి చెందిన చేబ్రోలు కిరణ్‌పై కేసు పెట్టి అరెస్టు చేయడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయడం శుపరిణామమని తులసిరెడ్డి అన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలి

● వైస్ చాన్సలర్ సుదర్శనరావు



జేఎన్టీయూ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు, హాజరైన విద్యార్థులు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేర్చుకునే విద్యతో తాము ఉద్యోగాలు సాధించడం కాదు ఉద్యోగ అవకాశాలు కల్పించేస్థాయికి చేరుకోవాలని అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సిలర్ ఆచార్య హెచ్.సుదర్శనరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పులివెందుల జేఎన్టీయూ కళాశాల వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ముందుగా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు విషయాల మీదనే కాక సాంకేతిక నైపుణ్యత,విలువలు, విద్య సృజనాత్మకతతో కళాశాల యూనివర్సిటీని రాష్ట్ర, దేశస్థాయిలో, వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధిని సంపాదించి కళాశాలను అగ్రస్థానంలో ఉంచాలని వివరించారు. అభ్యసన అవగాహన, నైపుణ్యాభివృద్ధి గోల్ సెట్టింగ్, అకడమిక్ క్రెడిట్ డిపాజిట్ స్కీం,మల్టీ డిసిప్లినరీ, ఇంటర్ డిసిప్లినరీ,సాంకేతికత, వాల్యూ ఆడెడ్‌కోర్సులపై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యకె.శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన

కడప (వినాయకనగర్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీడీయూ-జీకేవై పథకం కింద సిడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా 18 నుండి 32 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ ఎన్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. అందుబాటులో ఉన్న శిక్షణ కోర్సులు ఎలక్ట్రానిక్స్ రంగంలో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, హెల్త్‌కేర్ సెక్టార్ రంగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, సెక్టార్ రంగంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్ రంగంలో బ్యూటీ థెరపీ, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్, ప్రాక్టికల్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అవకాశాన్ని గ్రామీణ యువత వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాకు ఫోన్ నెంబర్లు 9063082227, 9966448807లను సంప్రదించాలని కోరారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్ శ్రీధర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి తాత్కాలిక ప్రణాళిక ద్వారా అవసరమైన గ్రామాల్లో నీటి రవాణాకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, పీఆర్, ఎస్సీ కార్పొరేషన్, జీఎస్‌డబ్ల్యుఎస్, పంచాయతీ తదితర శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా కూడా మనుషులకు, పశువులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో ఉన్న నీటి సరఫరా వనరులు, బోర్లు సక్రమంగా పనిచేసేలా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి సరఫరా అవసరమైన గ్రామాలకు తాత్కాలిక ప్రణాళిక కింద వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. రవాణాకు సంబంధించి యాప్ ద్వారానే బిల్లుల చెల్లింపులు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్లు, ప్రతి సచివాలయాల ప్రాంతంలో వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాయితీతో కూడిన రుణాల మంజూరుకు జిల్లాకు 563 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14 నుంచి మే 10వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్, మండల స్థాయిల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో జిల్లాలో పదివేల ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టాలని, ప్రతి నియోజకవర్గంలో 1500 ఎకరాలు, ప్రతి మండలంలో 500 ఎకరాల్లో తప్పనిసరిగా గడ్డి పెంపకం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాకు 1000 పశువుల నీటి తొట్టెల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే 176 నీటితొట్టెలను పూర్తి చేయగా మిగిలినవి ప్రగతిలో ఉన్నాయని, ఈనెల 14లోగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్ ఎస్ఈలు ప్రసన్నకుమార్, దయాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ఇన్‌చార్జి డీపీవో, ఎంపీడీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం టీచర్ల సమస్యలను పరిష్కరించండి : మంత్రికి వినతి

సిద్దవటం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూళ్లో ఆర్ట్, క్రాఫ్ట్, పీఈటీ, సంగీతం మరికొన్ని విభాగాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్ల సమస్యలపైన రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ హాజీమాలింగ్ శుక్రవారం సిద్దవటంలో మాట్లాడుతూ జిల్లాలో దాదాపు 500 మంది పార్ట్‌టైం టీచర్లుగా జిల్లా పరిషత్ హైస్కూళ్లో విధులు నిర్వహిస్తున్నా రన్నారు. గత 13 సంవత్సరాలుగా పనిచేస్తున్నా తక్కువ వేతనం వస్తోందని.. కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. పార్ట్‌టైం పదాన్ని తొలగించి ఒకేషనల్ టీచర్లుగా పేరుమార్చి తమకు మినిమమ్ టైం స్కేల్ మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఓబులేశు పాల్గొన్నారు.



బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే




జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, బెటాలియన్ కమాండెంట్ ఆనందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం మైసూరివారిపల్లి పంచాయతీ జనసేన కార్యాలయంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన కార్యకర్తలు జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో జ్యోతి రావు పూలే విగ్రహానికి మాదిగ అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, స్థానిక నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్తగా, బడుగు బలహీనవర్గాల ఆశా జ్యోతిగా, సామాజిక న్యాయం కోసం చేసిన కృషిని కొనియాడారు.

సిద్దవటం : మండలంలోని బాకరాపేట సమీపాన 11వ పోలీసు పటాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పోలీసు కమాం డెంట్ ఆనందరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీనవర్గాల కోసం జ్యోతిరావు పూలే చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమాం డెంట్ డి.నాగేశ్వరప్ప, ఎం.జియోఫిలాస్, వెంక టరెడ్డి, వెంకట శివుడు, ఆర్ఐ ఆర్ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణంలోని జిల్లా వైసీపీ కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావుపూలే చిత్ర పటానికి ఆ పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, రాష్ట్ర వైసీపీ బీసీ సెల్ అధికార ప్రతినిధి శిబ్యాల విజయభాస్కర్‌లు మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది జ్యోతి రావుపూలే అన్నారు. వైసీపీ నాయకులు ఆర్ల సుబ్బయ్య, పల్లపు రమేశ్, సాంబశివ సుగవాసి శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అడవులతో పాటు అటవీ సంపదను సంరక్షించడం మనందరి బాధ్యత అని.. ఇందుకోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోడూరు రేంజర్ శ్యాంసుందర్ కోరారు. జిల్లా అటవీశాఖ అధికారుల ఆదేశాల మేరకు కోడూరు సబ్ డివిజనల్ అధికారులు శుక్రవారం అటవీ ప్రాంతానికి సమీపంలోని బాలాజీ నగర్, శివాజీ నగర్, ఇందిరానగర్, తిరుగుడుపల్లి గ్రామాలలో ప్రజలకు అటవీ జంతు వుల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవిలోకి అక్ర మంగా ప్రవేశించడం వలన జంతువుల స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, ప్రజల ప్రాణాలకు కూడా ప్రమాదం అని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో నగేష్ నాయక్, కోడూరు రేంజ్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్ పాల్గొన్నారు.

అర్హులైన మైనార్టీలందరికీ ప్రభుత్వ పథకాలు : మంత్రి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి నియోజకవర్గంలో ఉన్న అర్హులైన పేద మైనార్టీలందరికీ రేషన్‌కార్డులు, ఇళ్లు, పింఛన్‌లు తదితర ప్రభుత్వ పథకాలన్నీ మంజూరు చేసి వారి అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాయచోటి పట్టణంలోని పాతరాయచోటి సమీపంలో గత పాత ఈద్గాలో నూతన బోరుకు మోటారు బిగించి ఈద్గాలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మైనార్టీలందరికీ ప్రభుత్వ పథకాలన్నీ అందజేసి వారి అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం మంత్రి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రాయచోటి నియోజకవర్గంలోని హిందూ, ముస్లింలు కలిసి మెలిసి జీవించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని అల్లాను ప్రార్థించామన్నారు. అనంతరం ఈద్గాలో మంత్రి మొక్కలు నాటి నీరు పోశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, అర్చనా విద్యాసంస్థల అధినేత డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, మైనార్టీ నేతలు వతన్‌నిస్సార్, అతావుల్లా, సయ్యద్ రియాజుద్దీన్, పలువురు ముస్లిం మత పెద్దలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పాత ఈద్గాలో ముస్లిం మైనార్టీలతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

పరిశుభ్రతపై గర్భిణులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో పద్మావతి

రామాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్లూరు సెక్టారులోని అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పరిశుభ్రతపై లక్కిరెడ్డిపల్లె సీడీపీవో పద్మావతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 22 వరకు పౌష్టికాహారం కార్యక్రమంలో భాగంగా గర్భవతులు, బాలింతలకు పరిశుభ్రతపై చర్చించారు. శిశువులకు ఇన్‌ఫెక్షన్‌ను నివారించడానికి తల్లులు చేతులు శుభ్రంగా కడుక్కొని పిల్లలకు ఆహారం అందించాలన్నారు. కిశోర బాలికలు, గర్భవతులు రక్తహీనత బారిన పడకుండా ఉండాలని సూచించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుజాత రెడ్డి, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్ ఆధ్వర్యంలో బీసీ సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ హాజరై మాట్లాడుతూ సమాజంలో 52 శాతం ఉన్న బీసీలకు 52శాతం రిజర్వేషన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం చేస్తామన్నారు. బీసీ సంఘాలు, కుల సంఘాలు పాల్గొని బహుజన్ సమాజ్ పార్టీకి మద్దతు ప్రక టించారు. బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్, ఇన్‌చార్జిలు మిద్దెపల్లి బాలాజీ, ఆంజనేయులు, రమణ, సెక్రటరీ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లెకు పోదాం'

సుండుపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సమస్యలను గుర్తించి పరిష్కరించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పల్లెకు పోదాం కార్యక్రమాన్ని ప్రారంభించిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనందగజపతిరాజు తెలిపారు. శుక్రవారం మండల బీజేపీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సుండుపల్లె ప్రభుత్వ ఆసుపత్రి, అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ బడి, సచివాలయాలను తనిఖీ చేశారు. అంగన్వాడీలో చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని ఆరాతీశారు. సచివాలయంలో రైతు సేవా కేంద్రంలో కిసాన్ క్రెడిట్ కార్డు, ఇతర సేవలపై ఆరాతీసినట్లు తెలిపారు. అనంతరం రాయవరం గ్రామ పంచాయతీలో పర్యటించారు. బీజేపీ నాయకులు రెడ్డెయ్యఆచారి, వెంకట్రామరాజు, మండల అధ్యక్షులు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై పరిశీలన

నందలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాటూరు పంచాయతీలో కేంద్ర ప్రభుత్వ సాయంతో నడుస్తున్న పథకాల అమలును పల్లెకు పోదాం... చలో అభియాన్ కార్యక్ర మంలో భాగంగా రాజంపేట అసెంబ్లీ కోకన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ ఆధ్వర్యంలో పరిశీలించారు. సచివాలయంలోని సిబ్బందితో సమావేశమై పించన్లు, ఉచిత బియ్యం, ఉపాధిహామీ పథకం తదితర కేంద్ర ప్రభుత్వ సహాయంతో నడుస్తున్న పథకాల వివరాలు అంగన్వాడీ కేంద్రంలో పనితీరు, ఎలిమెంటరీ స్కూల్ పిల్లల వసతులు, మధ్యాహ్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల బీజేపీ నాయకులు ముంగి సుబ్బరాయుడు, బాలాంజ నేయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

సంబేపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి నారాయణరెడ్డిపల్లె సచివాలయం సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ దేరంగుల నాగేంద్రకు గాయాలయ్యాయి. నారాయణరెడ్డిపల్లె గ్రామం ముద్దినేని వడ్డెపల్లికు చెందిన నాగేంద్ర ట్రాక్టర్‌లో రాయచోటికి వెళుతుండగా పీలేరు వైపు నుంచి రాయచోటికి వస్తున్న లారీ వెనుక భాగంలో ఢీకొంది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

21న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

పెనగలూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న 5వ తరగతి విద్యార్థులు ఈనెల 21న జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని ప్రిన్సిపల్ ఎస్.సహజబ్లెస్సీ తెలిపారు. ఈనెల 20న జరగాల్సిన పరీక్ష ఆ రోజు ఈస్టర్ పండుగ పర్వదినం కావడంతో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి 21కి మార్చడం జరిగిందని ఆమె తెలిపారు. అభ్యర్థులు నెట్‌సెంటర్‌లో హాల్‌టిక్కెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆమె తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

గాలివీడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలుకుంట పంచాయతీ రెడ్డివారిపల్లెలో శుక్రవారం శ్రీకోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. చతుర్దశి పర్వదినాన్ని పురస్కరించుకని వేదపండితులు సుబ్రమణ్యంశర్మ, కుమార్‌శర్మలచే రాములోరి కల్యాణం నిర్వహించారు. పుచ్చ ఓబుల్ నరసింహారెడ్డి దంపతులు రాములోరికి పట్టు వస్త్రాలు అందజేశారు. కల్యాణోత్సవంలో భక్తాదులు స్వామివారికి కాయకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు. గ్రామ సర్పంచ్ దంపతులు పార్థసారథిరెడ్డి, సులోచనమ్మ, హరినాథ్‌రెడ్డి, మొరార్జీ, కొండారెడ్డి, గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాపురం: నల్లగుట్టపల్లె పాతపల్లెలో శుక్రవారం కన పర్తి పెంచల్‌రెడ్డి చెన్నారెడ్డి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సీతారాములకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, రాత్రికి బాజా భజంత్రీలతో సీతారా ముల ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.

వీరబల్లి : మండలంలోని దిగువరాచపల్లి గ్రామం పెద్దహరిజనవాడలో శ్రీరామనవమిని పురష్కరించుకుని గురువారం రాత్రి సీతారాముల స్వామి వారి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన కోలాటం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. పురిమిగాళ్ల ప్రసన్నకుమార్ దంపతులు రామాలయం వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు.

అన్న ప్రసాదాలు వితరణ

సిద్దవటం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి మండలంలోని మాధవరం-1 రోడ్డు నంబరు 18 చిన్నపరెడ్డిపల్లె గ్రామంలో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లోని సీతారాముల కల్యాణం సందర్భంగా కాలినడకన నడుచుకుంటూ వెళ్లే భక్తులకు శుక్రవారం అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయినాధునికి పూజలు

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన షిరిడిసాయి బాబాకు గురుపౌర్ణమి పురష్కరించుకొని శుక్రవారం ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. షిరిడిసాయిబాబా మందిరంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యనిర్వాహకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కంకరను దొంగిలించడం సిగ్గుచేటు

● మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి

రాయచోటి టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని పాత గొల్లపల్లె సమీపంలో రహదారి నిర్మాణం కోసం నిల్వ ఉంచిన కంకరను మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు టిప్పర్ల ద్వారా దొంగిలించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఎస్పీ ఆఫీసుకు సమీపంలో ఉన్న కంకరను దౌర్జన్యంగా తరలిస్తున్నా పోలీసులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అనుచరులు వినోద్‌రెడ్డి, లక్ష్మి ప్రసాద్‌రెడ్డి, మౌర్యారెడ్డి కంకరను దౌర్జన్యంగా తరలించారని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. చంద్రబాబు, లోకేశ్ పేర్లు చెప్పుకుని మంత్రి మండిపల్లి దందాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సంఘటనపై పోలీసులను వివరణ కోరగా.. కంకర తరలింపు విషయంపై రమేష్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి



దుకాణదారులకు చెత్త కుండీలను పంపిణీ చేస్తున్న డీపీవో

సిద్దవటం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించేలా బాధ్యత వహించాలని డీపీవో రాజ్యలక్ష్మి సూచించారు. బాకరాపేట గ్రామం కూడలిలోని దుకాణదారులకు చెత్తకుండీలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు దుకాణదారులకు చెత్తకుండీలు పంపిణీ చేశామన్నారు. దుకాణదారులు చెత్తను కుండీల్లోనే వేసి ప్రతిరోజు గ్రామాల్లోకి వచ్చే గ్రీన్ అంబాసిడర్ వాహనంలో చెత్తవేయాలని తెలియజేశారు. బద్వేల్ డీఎల్పీవో రమణారెడ్డి, ఏవో ఖాదర్‌బాషా, సర్పంచ్ ప్రతినిధి ప్రతాప్‌నాయుడు, పంచాయతీ సెక్రటరీ రాజేష్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు, మామిడియార్డు సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్లు తొలగించే క్రమంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. వినియోగదారులు ఇందుకు సహకరించాలని కోరారు.

ఘనంగా విగ్రహా పునఃప్రతిష్ఠ



బొమ్మవరం శివాలయంలో తొలిరోజు ప్రారంభించిన కుంభాభిషేకం

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మవరం గ్రామంలో ఉన్న పురాతన శివాలయంలో పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శంకరవిజ యేంద్ర సరస్వతి స్వామి బృందంచే ఘనంగా ప్రారంభించారు. పురాతన కాలంలో బ్రహ్మవరంగా పిలువబడిన ఈ గ్రామంలో శ్రీ పర్వతవర్ధిని సమేత రామ లింగేశ్వరస్వామి ఆలయం ఉందని పెద్దలు తెలిపారు. కాలక్రమేణా బొమ్మవరంగా ప్రసిద్ధి చెందిందని తెలిపారు. గ్రామానికి వెలుపల ఉన్న పొలాల్లో మట్టి దిబ్బల కింద ఉన్న ఈ ఆలయానికి గ్రామస్థులు పూర్వ వైభవం తీసుకురావడానికి శ్రీకారం చుట్టారు. కంచి కామ కోటి పీఠాధిపతి ఆశీస్సులతో పునఃప్రతిష్ఠ, పూర్వక కుంభాభిషేక మహోత్సవం వేదమంత్రాలతో నిర్వహించారు. కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.








సీతారాముల కల్యాణాన్ని తిలకిస్తున్న ముఖ్యమంత్రి దంపతులు




ఎదుర్కోలు దృశ్యం


కోదండరాముడి ఊరేగింపు దృశ్యం







కల్యాణం.. కమనీయం..

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఉత్సవరులను పల్లకీపై కొలువు దీర్చి ప్రధాన ఆలయం నుంచి మంగళవాయిద్యాల మధ్య భక్తుల శ్రీరామ.. జయజయరామ ధ్వానాలతో కల్యాణ మండపం వద్దకు తీసుకువచ్చారు. వేదికపైన రజిత సింహాసనంపై కల్యాణమూర్తులను ఆశీనులు చేసిన అనంతరం పూజా సామాగ్రికి సంప్రోక్షణ జరిపి ఎలాంటి విఘ్నాలు, ఆటంకాలు తలెత్తకుండా విశ్వక్సేనపూజ జరిపించారు. కర్మణ్యే పుణ్యాహవచనం అనే మంత్రంతో మంటపశుద్ధి జరిపి కల్యాణ తంతుకు శ్రీకారం చుట్టారు. ముంజానికీ ప్రథమం అనే మంత్రం చదువుతూ రామయ్యను సీతమ్మను ఎదురెదురుగా కూర్చొండబెట్టి కన్యావరణం జరిపించారు. మోక్ష బంధనం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణయజ్ఞోపవీత ధారణం చేసిన అనంతరం ఆశీర్వచనం, ప్రాదప్రక్షాళనం, పుష్పోదకస్నానం నిర్వహించి వరపూజ జరిపించారు.. మధుపర్కాపాసన అనంతరం పెరుగు, తేనె కలిపిన మిశ్రమాన్ని స్వామి వారికి నివేదించాక నునుసిగ్గుల మొలక అయిన సీతమ్మ నొసటన కల్యాణ బొట్టును, బుగ్గన కాసింత దిష్టిచుక్క పెట్టుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమర్పించిన పట్టు వస్త్రాలు సమర్పించి పెళ్లికూతురుగా అందంగా ముస్తాబు చేశారు. ఆమెకు ఏమాత్రం తీసిపోని విధంగా శివధనస్సు విరిచిన శ్రీరామ చంద్రమూర్తి అదే రీతిలో సీతమ్మ ఎదుట కూర్చొన్నాడు. తరువాత లోక క్షేమం కోసం మహాసంకల్పం పఠించి కన్యాదానం, గోదానం, భూదానం జరిపించారు. సీతమ్మకు, రామయ్యకు ఒక్కొక్కరికీ 8 శ్లోకాలతో మంగళకాష్టం చదివారు. మంగళవాయిద్యాలు.. వేదపండితుల చతుర్వేద పఠనం.. భక్తుల రామనామ ధ్వనుల మధ్య సీతారాముల శిరస్సులపై జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. అనంతరం గౌరీదేవి, సరస్వతిదేవి, మహాలక్ష్మీ అమ్మవార్లను ఆవాహనం చేసి సకలమంగళాలకు ఆలవాలమైన మంగళసూత్రానికి పూజ చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్ర వేదపండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్ మంగళసూత్రాన్ని భక్తులకు చూపించి సాక్షాత్తు లక్ష్మీనారాయణుడైన శ్రీరామ చంద్రమూర్తి చేత మహాలక్ష్మీ స్వరూపిణి సీతామహాదేవికి 8.10 గంటలకు శాస్త్రోక్తంగా మంగళసూత్రాధారణ జరిపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెచ్చిన ముత్యాల తలంబ్రాలు కల్యాణ మూర్తుల శిరస్సులపై పోసి కన్నుల పండువగా కల్యాణం జరిపించారు. అనంతరం నివేదన ఇచ్చి బ్రహ్మముడి వేశాక మహదాశీర్వచనం నిర్వహించారు. హారతి ఇవ్వడంతో సీతారాముల కల్యాణ క్రతువు ముగిసింది. ఈ సందర్భంగా కల్యాణ వేదిక ప్రాంగణం చుట్టూ వైకుంఠాన్ని తలపించే విద్యుత్ దీప కాంతులు, వివిధ దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లు కల్యాణోత్సవానికి మరింత శోభను తెచ్చిపెట్టాయి. కల్యాణోత్సవాన్ని భక్తులు దగ్గరగా తిలకించేందుకు వీలుగా భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు, ఉక్కపోతతో భక్తులు ఇబ్బందులు పడకుండా ఏసీలు, కూలర్‌లను కల్యాణ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవానికి అనేక ప్రాంతాల నుంచి తరలి వచ్చిన లక్ష మందికి పైగా భక్తులు వీక్షించి ముగ్ధులయ్యారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ అధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి భక్తుడికి మంచినీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు, ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను అందజేశారు.

రామ నామస్మరణతో మార్మోగిన ఒంటిమిట్ట

ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి సాయంత్రానికే కల్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. ఎటుచూసినా భక్తుల శ్రీరామనామంతో కల్యాణ ప్రాంగణం మార్మోగింది. కడప, అన్నమయ్య జిల్లాల్లోని అన్ని మండల కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సులు, ఇతర వాహనాల్లో భారీ ఎత్తున ఒంటిమిట్టకు తరలివచ్చారు. జనసంద్రంతో కల్యాణవేదిక కిటకిటలాడిపోయింది. ఇటు చెన్నై, అటు కడప ప్రధాన రహదారులన్నీ భక్తులతో కిటకిటలాడిపోయాయి. ఎటుచూసినా వాహనాలు కిక్కిరిసిపోయాయి. నేల ఈనిందా అన్న రీతిలో కోదండరాముడి కల్యాణ వేదిక వద్దకు వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఓ రామా.. నీ నామమెంతో రుచిరా.. రామా.. రామా.. రామా.. అన్న రీతిలో జనసంద్రం తరలివచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానం అంతా టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి, జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ ఆగమశాస్త్ర పండితులు కంకణబట్టర్ రాజేష్‌కుమార్, పురోహితులు భారీ ఎత్తున తరలివచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం కనీవిని ఎరుగని రీతిలో శ్రీవారి సేవకులను ఉపయోగించి భారీ ఎత్తున కల్యాణోత్సవ ఏర్పాట్లను చేశారు.

అలరించిన సంకీర్తనలు

ఒంటిమిట్ట సీతరాముల కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం కల్యాణవేదికపై ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు వందన, కళాశాల విద్యార్థులు ఆలపించిన సంకీర్తలు భక్తులను మైమరిపించాయి. ఇందులో భాగంగా సాయంత్రం 4 గంటలకు అధ్యాపకులు, విద్యార్థులు ఆలపించిన రామ రామా.. రఘురామా... పరమాత్మరా... పాహి కల్యాణ రామ పావన గుణరామా... ఎక్కడ చూసినా మన శ్రీరాముడే... తదితర సంకీర్తనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి.

సీతారాములకు శ్రీవారి కానుక

కల్యాణం సందర్భంగా తిరుమల నుంచి వేంకటేశ్వర స్వామి శుక్రవారం కానుకలు పంపారు. కల్యాణానికి స్వర్ణ కిరీటం, యజ్ఞోపవీతం ఆభరణాలను కానుకగా అందించారు. టీటీడీ ఆనవాయితీలో భాగంగా శుక్రవారం ఈ ఆభరణాలను సమర్పించారు. ఆలయం ముందు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు ఆభరణాలకు పూజలు చేసి కోదండరామునికి అందజేశారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఎం సతీమణి నారా భువనేశ్వరి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కడప ఇన్‌చార్జి మంత్రి సవిత, రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు సీఎం రమేశ్, టీటీడీ ఈవో శ్యామలరావు, కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, కడప ఎస్పీ అశోక్‌కుమార్, అన్నమయ్య ఎస్పీ విద్యాసగర్‌నాయుడు, రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలతో పాటు ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. పోలీసులకు ఫిర్యాదు


అదృశ్యమైన శంకర్‌రెడ్డి

రామసముద్రం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన రామసముద్రం మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మూగవాడి గ్రామానికి చెందిన జి.శంకర్‌రెడ్డి పుంగనూరులోని ఓ ప్రైవేట్ బ్యాంకులో వ్యక్తిగత అవసరాల కోసం కొంత డబ్బు రుణం తీసుకున్నాడు. అయితే డబ్బు తిరిగి వసూలు చేసే క్రమంలో బ్యాంకు అధికారుల వేధింపులు తాళలేక శంకర్‌రెడ్డి ఈనెల 10న అదృశ్యమయ్యారు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో అతడి సోదరుడు శుక్రవారం రామసముద్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దారి విషయమై ఘర్షణ.. గాయపడిన మహిళ

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం రెవెన్యూ గ్రామ పంచాయతీ పరిధిలో ఇంటి గోడ దారి విషయమై శుక్రవారం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు, అదే గ్రామానికి చెందిన మహిళపై దాడి చేశారు. ఈ సంఘటనలో రాజేశ్వరి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల కథనం ప్రకారం చియ్యవరం గ్రామానికి చెందిన రాజేశ్వరి, బాలు విజయ కుమారి మధ్య ఇంటి దారి విషయంలో వివాదం తలెత్తింది. ఈ వివాదం ముదిరి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో విజయకుమారి భర్త బాలు మల్లికార్జున, మరో ఇద్దరు రాజేశ్వరిపై దాడి చేశారు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఆమెను కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి రెఫర్ చేశారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నవీన్ బాబు వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని మదనపల్లె పట్టణం శేషమహల్ ఏరియాకు చెందిన సందీప్ అనే యువకుడు శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని వన్‌టౌన్ సీఐ ఏరిసావలి తెలిపారు. గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపికైన వీఆర్‌డీఎస్ సంస్థ

వీరబల్లి, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లుగా అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోమలరాజు శివరాజు పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతిని పురష్కరించుకొని చిత్తూరు పట్టణంలోని విజయం ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన సుమారు 150 మంది వివిధ విభాగాల్లో సేవలందించిన సేవా ప్రతినిధులకు శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. అందులో భాగంగా అన్నమయ్య జిల్లా నుంచి వీఆర్‌డీఎస్ సంస్థకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు లభించింది. ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకునేందుకు వీఆర్‌డీఎస్ సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి ఆ సంస్థ అధ్యక్షులు సురేంద్రారెడ్డిని ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో సేవా ప్రతినిధులు, ఇంపాక్ట్ నేషనల్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సురేంద్రారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ఓటర్లకు అనుకూలంగా
పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్


రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులకు సూచనలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఓటర్లకు అనుకూలంగా వుండేలా పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సబ్‌కలెక్టర్ (ఈఆర్‌వో) మేఘస్వరూప్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులు, ఏఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నివాస ప్రాంతాలకు 2 కి.మీ. పరిధిలోనే పోలింగ్ కేంద్రం వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖాళీగా వున్న బీఎల్‌వో, బీఎల్ఏ స్థానాలను భర్తీ చేయాలన్నారు. ఓటరు కార్డులను ఆన్‌లైన్‌లో చెక్‌చేసి, తప్పులు, డబుల్ ఎంట్రీలు, ఫోటోలు మారి వుంటే సరిచేయాలని సూచించారు. సీపీఎం ప్రతినిధి శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలోని 98వ పోలింగ్ కేంద్రం నుంచి 145 పోలింగ్ కేంద్రం వరకు ఒకే ఇంటిలోని ఓటర్లను పలు పోలింగ్ కేంద్రాలకు కేటాయించారని, అలా కాకుండా ఒక ఇంట్లోని ఓటర్లను ఒకే పోలింగ్ కేంద్రంలో వుండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నిమ్మనపల్లె తహసీల్దార్ అమరనాథ్, డీఏవో రాఘవేంద్ర, టీపీవో జకీరాబేగం, రాజకీయపార్టీల ప్రతినిధులు బాలుస్వామి, రెడ్డిసాహెబ్, భగవాన్, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లును
కేంద్రం వెనక్కితీసుకోవాలి

● ముస్లింల డిమాండు ● మద్దతు పలికిన రాజకీయ పార్టీలు


సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లింలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నమాజ్ అనంతరం పెద్ద సంఖ్యలో ముస్లింలు స్థానిక బెంగళూరు బస్టాండ్‌కు చేరుకుని ఆందోళన చేపట్టారు. ఇందుకు కాంగ్రెస్, వైసీపీ, సీపీఐ, బాస్ నాయకులు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. వన్‌టౌన్ సీఐ ఎరిసావలి, టూటౌన్ సీఐ రామచంద్ర, తాలుకా సీఐ కళా వెంకటరమణ, తమ సిబ్బందితో ర్యాలీని ఆపడానికి ప్రయత్నించడంతో ముస్లింలకు, పోలీసులకు తోపులాట జరిగింది. ర్యాలీకి జెండాలు, డీజేల వాడకం నిషేధమని, కొందరు మాత్రమే వెళ్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించవచ్చని తెలిపారు. పట్టించుకోని ముస్లిం యువత బారికేడ్లను తొక్కుకుంటూ ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. సబ్ కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అర్ధగంట తరువాత ఆందోళన విరమించారు.

కార్యక్రమంలో బాస్ నేత పీటీఎం శివప్రసాద్, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషార్‌అహ్మద్, సీపీఐ నాయకులు కృష్ణప్ప, సాంబశివ, మురళి, భారతీయ సేన అధ్యక్షుడు శ్రీచందు, ముస్లింలు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న రాజకీయ పార్టీల నేతలు

గురవయ్యపై వైసీపీ నేత కుమారుడు హత్యాయత్నం

వేముల, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నేత వర్ర రవీంద్రనాథరెడ్డి కుమారుడు వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి తన కుమారుడు గురవయ్యపై హత్యాయత్నం చేసినట్లు షేక్షావలి తెలిపారు. షేక్షావలి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం ఉదయం 11గంటల సమయంలో గురవయ్య తుమ్మలపల్లెలోని తన నివాసం వద్ద ఉండగా కొండ్రెడ్డిపల్లె గ్రామానికి చెందిన వర్ర హేమంత్‌కుమార్‌రెడ్డి వచ్చి తాను వేముల కానిస్టేబుల్‌నని, నీ మీద ఫిర్యాదు వచ్చింది స్టేషన్‌కు రా అని బైక్‌పై తీసుకెళ్లి పులివెందుల-కడప ప్రధాన రహదారిలోని కుప్పగుట్టపల్లె వరకు బైకులో తీసుకెళ్లి మా నాయనను తిడతావా అంటూ బూతులు తిడుతూ రాడ్డుతో విచక్షణారహితంగా దాడి చేసినట్లు తన కుమారుడు తెలిపాడని షేక్షావలి పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న గురవయ్య భార్య మరికొందరితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించినట్లు షేక్షావలి తెలిపారు. ఈ విషయమై స్థానిక పోలీసులను సంప్రదించగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


చికిత్స పొందుతున్న గురవయ్య

ఆలస్యంగా నడిచిన నరసాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైలు

● మూడున్నర గంటలకుపైగా ఆలస్యంతో ప్రయాణికుల అవస్థలు



ములకలచెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నరసాపూర్ నుంచి ములకలచెరువు మీదుగా ధర్మవరం జంక్షన్‌కు నడిచే ఎక్స్‌ప్రెస్ రైలు శుక్రవారం ఆలస్యంగా నడిచింది. మూడున్నర గంటలకుపైగా ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయవాడ జంక్షన్‌లో ఇంజన్ మొరాయించడంతో రైలు ఆలస్యంగా నడిచిందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు ములకలచెరువుకు ఉదయం 6.49 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 10.30 గంటలకు వచ్చింది. అలాగే పీలేరుకు ఉదయం 5.39 గంటలకు రావాల్సి ఉండగా ఉదయం 9.07 గంటలకు వచ్చింది. దీంతో ప్రయాణికులు గంటల తరబడిగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలిగా మల్లిక


నియామక పత్రం అందుకుంటున్న మల్లిక

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జనసేన వీర మహిళ మల్లికను నియమించారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఇంతటి పదవి ఇచ్చిన ఆర్.కృష్ణయ్య, జనసేన నాయకులు, వీరమహిళలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకురాలు దారం అనిత, టీడీపీ నేత బిల్లేరెడ్డిప్రసాద్, రమణ, రూప, సిద్దయ్య, కళ్యాణి, రేఖా, తదితరులు పాల్గొన్నారు.

కోదండరాముడి ఊరేగింపులో ఘర్షణ

● ఇరువురికి గాయాలు

రైల్వేకోడూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని చెన్నరాజుపోడు గ్రామంలో బుధవారం రాత్రి ప్రశాంతంగా శ్రీరామనవమి వేడుకలలో భాగంగా ఊరేగింపు జరుగుతుండగా పత్తి రాజేశ్వరి ఆమె భర్త సుబ్బరాయుడు తదితరులపై అదే గ్రామానికి చెందిన జోగినేని మణి (అలియాస్ చిన్న మణి) తన అనుచరులతో దాడి చేసినట్లు రాజేశ్వరి శుక్రవారం ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితురాలి కథనం మేరకు.. పత్తి రాజేశ్వరి చెన్నరాజుపోడు గ్రామంలో నివాసముంటున్నారు. ఆమె భర్త సుబ్బరాయుడు కువైత్‌తో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిలో ఓ వివాహం ఉన్న కారణంగా వచ్చిన సుబ్బరాయుడు చెన్నరాజుపోడులో కోదండరాముని ఊరేగింపును చూసుకునేందుకు చిన్నరాజుపోడుకు వచ్చారు. ఈ ఊరేగింపులో భార్యాభర్తలపై జోగినేని మణి దాడి చేశాడని తెలిపారు. దీంతో సుబ్బరాయుడు, రాజేశ్వరిలకు గాయాలయ్యాయని, కువైట్‌లో శెలవు లేనందున తిరుపతిలో వివాహం చూసుకుని తన భర్త కువైట్‌కు వెళ్లాడని బాధితురాలు తెలిపింది. ఈ మేరకు ఓబులవారిపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ చేస్తామని పోలీసులు తెలిపారు.



ఫిర్యాదు చేయడానికి వచ్చిన రాజేశ్వరి

రెవెన్యూ అధికారులకు జరిమానా

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో అనర్హులకు ఇళ్ల పట్టాలు జారీ చేశారన్న అభియోగాలపై ఇద్దరు రెవెన్యూ అధికారులకు జరిమానా విధిస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా విచారణ చేపట్టిన కలెక్టరు 2018 ఆగస్టు 18న ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక పంపారు. అప్పట్లో పులివెందుల తహసీల్దారుగా పనిచేసిన ఎల్.వి.ప్రసాద్ (ప్రస్తుతం రిటైరయ్యారు), ఏఆర్ఐ ఎ.సుజీత్‌కుమార్‌లను బాధ్యులుగా తేల్చారు. అనంతరం దీనిపై విచారణ జరపడానికి జాయింట్ కలెక్టరు-2ను నియమించారు. విచారణ అనంతరం 2020 మే 27 జాయింట్ కలెక్టర్-2 అక్రమాలపై ఇరువురినీ బాధ్యులుగా నిర్ధారిస్తూ నివేదికను ప్రభుత్వానికి పంపారు. అనర్హులకు పట్టాలివ్వడంలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి తహసీల్దారు ఎల్.వి.ప్రసాద్ నెలవారీ పింఛనులో 6 శాతం కోత, ఏఆర్ఐ సుజీత్‌కుమార్ ఒక వార్షిక పింఛను నిలుపుదల చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పి సిసోడియా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

డీఎల్‌డీవోగా వెంకటనారాయణ

కలికిరి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కడప డివిజన్ డీఎల్‌డీవోగా జి.వెంకటనారాయణను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఈయన తిరుపతి తుడా కార్యదర్శిగా డెప్యుటేషన్‌లో పనిచేస్తుండగా కడప డీఎల్‌డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ఎన్నాళ్లీ.. నిరీక్షణ

● రేషన్ కార్డుల కోసం ఎదురు చూపులు ● సచివాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వమందించే సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉండే రేషన్‌కార్డుల కోసం నిరుపేద కుటుంబాలు ఎదురు చూపులు చూస్తున్నారు. వైసీపీ అధి కారంలో ఉండగా పులివెందుల నియోజకవర్గం పరిధిలో తూతూ మంత్రంగా కొంత మందికే కార్డులు మంజూరు చేసింది. 2023 జూన్‌లో వివిధ సాంకేతిక సమస్యలు, ఇతర కారణాల చేత రేషన్ కార్డుల పంపిణీ సక్రమంగా సాగలేదు. దరఖాస్తు చేసుకున్న ఆరు నెల ల తరువాత కొత్తకార్డులు ఇస్తామని చెబుతూ కాలయాపన చేసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రేషన్‌కార్డు లేని ప్రజల్లో ఆశలు చిగురించాయి. అందుకనుగుణంగా కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు చేర్పులు మార్పులకు అవకాశమిస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాఫ్ట్‌వేర్‌లో ఉత్పన్నమైన కొన్ని సమస్యలతో ఆ ప్రక్రియ చేపట్టడంలో జాప్యమవుతుంది. విషయం తెలియని ప్రజలు రేషన్‌కార్డుల కోసం మీసేవ కేంద్రాలు, సచివాలయాలకు పరుగులు తీస్తున్నారు.

2023 నుంచి నూతనంగా వివాహాలు జరుపుకున్నవారు తప్పు ఒప్పులు, మార్పులు చేర్పులు, నూతనగా కార్డులు పొందాల్సిన వారు ఇలా ఎంతో మంది రేషన్‌కార్డులు లేక తంటాలు పడుతు న్నారు. అలాగే రేషన్‌కార్డు లేక సీఎం రిలీఫ్‌ఫండ్ కోసం అవస్థలు పడుతున్న వారు కూడా కోకొల్లలుగా ఉన్నారు. అధికారులు, నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలకు రేషనుకార్డే ప్రామాణికంగా తీసుకోవడంతో కొత్తవి కోరుతూ మండ లం, ఆర్డీవో, జిల్లా స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజలు పెద్దఎత్తున అర్జీలు ఇస్తున్నారు. రెండేళ్ల నుంచి రేషన్‌కార్డులు చేర్పు లు మార్పులకు అవకాశం లేకపోవడంతో ఇప్పుడు అటు తహసీల్దరు, ఇటు పౌరసరఫరాల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వం కసరత్తు చేస్తుందని, త్వరలో ప్రకటన వస్తుం దని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం సమ స్యను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

కాళ్లరిగేలా తిరుగుతున్నా

సుమారు ఐదేళ్ల క్రితం వివాహం అయింది. నాకు ఇద్దరు పిల్లలు సంతానం. రోజువారి కూలీతో నా భర్త కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రేషన్‌కార్డు కోసం అన్ని చోట్ల తిరుగుతున్నాం. కార్డు మంజూరు కాలేదు. సంక్షేమ పథకాలు అందడం లేదు. అధికారులు రేషన్‌కార్డు మంజూరు చేసి ఆదుకోవాలి.

- మమత, పులివెందుల

ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నాం.

నాకు నాలుగేళ్ల కిందట వివాహమైంది, ప్రస్తుతం ఇద్దరు పిల్లలు. రోజూ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. రేషన్‌కార్డు లేకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. అత్యవసర వైద్యసేవలు పొందాలన్నా ఆరోగ్యశ్రీ లేదు. అధికారులు తమ గోడు పట్టించుకుని రేషన్‌కార్డు మంజూరు చేయాలి.

- వెంకటలక్షుమ్మ, పులివెందుల

సైట్ ఓపెన్ కాగానే కార్డులు మంజూరు చేస్తాం



రేషన్‌కార్డుల సమస్య ఉన్నది వాస్తవమే. ప్రస్తుతం నివేశన స్థలాలకు సంబంధించిన లాగిన్ అందుబాటులోకి వచ్చింది. అయితే రేషన్‌కార్డులకు సంబంధించిన సైట్ ఓపెన్ కావడం లేదు. కార్డులకు సంబంధించి అర్జీలు స్వీకరిస్తాం. ఈ క్రమంలో అప్‌డేట్ జరగ్గానే అర్హులను గుర్తించి రేషన్‌కార్డులు మంజూరు చేస్తాం.

- చిన్నయ్య, ఆర్డీవో, పులివెందుల

క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగాలకు ఎంపిక



క్యాంపస్ డ్రైవ్‌లో ఎంపికైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యో తి): వైవీయూ క్యాం పస్ డ్రైవ్‌లో 15 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వైవీయూ ఎంబీఏ శాఖ అధిపతి డాక్టర్ పి.సరిత ఆధ్వర్యంలో రిలయన్స్ రిటైల్ సంస్థ నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థుల ప్రతిభను గుర్తించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఏటా రూ.2.75 లక్షల వేతనం, పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ వంటి పలు సౌకర్యాలను సంస్థ కలిస్తుందని రిలయన్స్ లిమిటెడ్ మేనేజర్ భానుప్రకాష్ తెలిపారు. డీన్ వై.సుబ్బరాయుడు ఉద్యోగాలు పొందిన వారిని అభినందించారు. బీవోఎస్ చైర్మన్ డాక్టర్ బి.గంగయ్య మాట్లాడుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంబీఏ శాఖ అధిపతి డా క్టర్ పి.సరిత మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ ఎంపికలకు రావడం పట్ల హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ లిమిటెడ్ సీనియర్ మేనేజర్ కె.సుమన్, ఎస్.మాధవి, ఎంబీఏ సహ ఆచార్యులు డాక్టర్ వరప్రభాకర్, అధ్యాపకులు పి.రాజశేఖర్, అనిల్ దేవకుమార్, సుధీర్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాదంలో మృతి చెందిన వెంకటరాముడు

సింహాద్రిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాళమ్మగూడూరు-బలపనూరు గ్రామాల మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బోయ వెంకటరాముడు (35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... మృతుడు వెంకటరాముడు అనంతపురం జిల్లా యాడికి మండలం ఓబుళాపురం గ్రామానికి చెందినవాడు. వెంకటరాముడు కూలి పనులు చేసుకుని తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో పులివెందులలో అరటి గెలలు కోత పనులు చేస్తూ శుక్రవారం పులివెందుల నుంచి తన స్వగ్రామానికి బైకుపై వెళుతుండగా ట్రాక్టర్ ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు.

బాలల సంక్షేమ సమితిలో ఇద్దరు చిన్నారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని పిల్లలను ఐసీడీఎస్ అధికారులు బాలల సంక్షేమ సమితిలో ఉంచారు. ఐసీడీఎస్ ప్రొటెక్షన్ అధికారి సుభాష్ అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం మాస్టర్ సాకేత్ (మూడేళ్లు), మల్లి (రెండేళ్లు) అనే ఇద్దరు పిల్లలు కడప రైల్వేస్టేషన్‌లో తిరుగుతున్నారని సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ సీడీపీఓ, సూపర్‌వైజర్, మహిళా పోలీస్ వెళ్లి ఆ ఇద్దరు పిల్లలను తీసుకొని కడపలోని బాలలసంక్షేమ సమితికి అప్పగించినట్లు చెప్పారు. ప్రస్తుతం సాకేత్, మల్లి మగపిల్లలు. ప్రత్యేక దత్తత సంస్థ, జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ కడపలో ఉంచినట్లు చెప్పారు. ఆ పిల్లల తల్లిదండ్రులు కానీ ఇతర కుటుంబ సభ్యులు ఎవరైన ఉంటే బాలల సంక్షేమ సమితి కడప వారిని సంప్రదించాలని కోరారు.

35 బస్తాల బియ్యం స్వాధీనం

దువ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం కానగూడూరులో అక్రమంగా నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ప్రొద్దుటూరు సీఎస్‌డీటీ మల్లికార్జున, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల సంయుక్త దాడిలో సుమారు రూ.80,500 విలువ గల 35 బస్తాలు స్వాధీనం చేసుకుని సుబ్రమణ్యం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పంచనామా ద్వారా దువ్వూరు పోలీసులకు నిందితుడిని అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

రేషన్ దుకాణం సీజ్

బద్వేలుటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని గోపవరం మండలం శీలంవారిపల్లెలోని చౌకదుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. తనిఖీల్లో 4897 కేజీల రేషన్ బియ్యం, 128 కేజీల చక్కెర తక్కువ ఉండటంతో షాపును సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ గీతా ప్రసాద్ రెడ్డి, ఏడీఐ లక్ష్మీ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన అర్హులైన యువకులు స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 828 యూనిట్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు. 34.40 కోట్ల రుణాలు అందజేయడం జరుగుతుందని, రూ.13.57కోట్లు సబ్సిడీ,రూ.1.72కోట్ల లబ్దిదారు వాటా, రూ.19.12కోట్లు బ్యాంకు రుణం ఉంటుందని వివరించారు. అర్హులైన కులాలకు చెందిన వారు ఈనెల 14 నుంచి వచ్చే నెల 10వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కోరారు.

చిన్నారుల ఉసురు తీసిన నీటికుంట

చిట్వేలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆ చిన్నారులంతా బంధువులు. సరదాగా ఆడుకోవడానికి నీటికుంట వద్దకు వెళ్లి ఆ కుంటలోనే మునిగి ముగ్గురు అసువులు బాశారు. ఈ విషాదకర సంఘటన చిట్వేలి మండలంలో శుక్రవారం జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని ఎం.రాచపల్లెలో శుక్రవారం సాయంత్రం గ్రామానికి సమీపంలో ఉన్న నీటికుంటలో చొక్కరాజు దేవాన్ష్ (5), చొక్కరాజు విజయ్ (4), రెడ్డిచర్ల యశ్వంత్ (5) ముగ్గురు చిన్నారులు కుంటలోకి దిగి ఆడుకోవడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు అందులో ఉన్న నీటిలో పడి మృతి చెందారు. చిన్నారుల ఆచూకీ కోసం వెతుకుతుండగా కుంటలో విగత జీవులుగా పడి ఉన్న ముగ్గురు చిన్నారులను గ్రామస్థులు హుటాహుటిన చిట్వేలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో గ్రామం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది.



యశ్వంత్, విజయ్, చొక్కరాజు దేవాన్ష్‌ల మృతదేహాలు

సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. తహసీల్దార్ మురళీకృష్ణ, వీఆర్వో భుజంగరావు, వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

వంటగ్యాస్ సిలిండర్లకు వర్ధంతి : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సిలిండర్‌పై రూ.50 పెంచిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గ్యాస్ సిలిండర్లకు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లకు పూలమాల వేసి నిరసన తెలిపారు. తులసిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో 2014లో గ్యాస్ సిలిండర్ ధర రూ.410 ఉండేదని, బీజేపీ పాలనలో పలుమార్లు ధర పెంచి రూ.853 చేశారని తెలిపారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలపై అనుచత వ్యాఖ్యలు చేసిన టీడీపీకి చెందిన చేబ్రోలు కిరణ్‌పై కేసు పెట్టి అరెస్టు చేయడం, పార్టీ నుంచి సస్పెండ్ చేయడం శుపరిణామమని తులసిరెడ్డి అన్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలి

● వైస్ చాన్సలర్ సుదర్శనరావు



జేఎన్టీయూ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు, హాజరైన విద్యార్థులు

పులివెందుల రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నేర్చుకునే విద్యతో తాము ఉద్యోగాలు సాధించడం కాదు ఉద్యోగ అవకాశాలు కల్పించేస్థాయికి చేరుకోవాలని అనంతపురం జేఎన్టీయూ వైస్ చాన్సిలర్ ఆచార్య హెచ్.సుదర్శనరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పులివెందుల జేఎన్టీయూ కళాశాల వార్షికోత్సవం నిర్వహించగా ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ముందుగా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టు విషయాల మీదనే కాక సాంకేతిక నైపుణ్యత,విలువలు, విద్య సృజనాత్మకతతో కళాశాల యూనివర్సిటీని రాష్ట్ర, దేశస్థాయిలో, వివిధ రంగాలలో నైపుణ్యాభివృద్ధిని సంపాదించి కళాశాలను అగ్రస్థానంలో ఉంచాలని వివరించారు. అభ్యసన అవగాహన, నైపుణ్యాభివృద్ధి గోల్ సెట్టింగ్, అకడమిక్ క్రెడిట్ డిపాజిట్ స్కీం,మల్టీ డిసిప్లినరీ, ఇంటర్ డిసిప్లినరీ,సాంకేతికత, వాల్యూ ఆడెడ్‌కోర్సులపై సవివరంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డి.విష్ణువర్దన్, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్యకె.శేషమహేశ్వరమ్మ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పన

కడప (వినాయకనగర్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీడీయూ-జీకేవై పథకం కింద సిడాప్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ ద్వారా 18 నుండి 32 సంవత్సరాల వయస్సు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజనం, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. అందుబాటులో ఉన్న శిక్షణ కోర్సులు ఎలక్ట్రానిక్స్ రంగంలో ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, హెల్త్‌కేర్ సెక్టార్ రంగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, సెక్టార్ రంగంలో జూనియర్ సాఫ్ట్‌వేర్ వెబ్ డెవలపర్బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్ రంగంలో బ్యూటీ థెరపీ, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వం గుర్తించిన సర్టిఫికెట్, ప్రాక్టికల్ శిక్షణ, సాఫ్ట్ స్కిల్స్ అభివృద్ధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అవకాశాన్ని గ్రామీణ యువత వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాకు ఫోన్ నెంబర్లు 9063082227, 9966448807లను సంప్రదించాలని కోరారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు : కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా జిల్లాలో నీటి ఎద్దడి నివారించడానికి తాత్కాలిక ప్రణాళిక ద్వారా అవసరమైన గ్రామాల్లో నీటి రవాణాకు వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి ఆర్‌డబ్ల్యుఎస్, డ్వామా, పీఆర్, ఎస్సీ కార్పొరేషన్, జీఎస్‌డబ్ల్యుఎస్, పంచాయతీ తదితర శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎక్కడా కూడా మనుషులకు, పశువులకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు గ్రామాల్లో, మండలాల్లో, మున్సిపాలిటీల్లో ఉన్న నీటి సరఫరా వనరులు, బోర్లు సక్రమంగా పనిచేసేలా తగు పర్యవేక్షణ చేయాలన్నారు. నీటి సరఫరా అవసరమైన గ్రామాలకు తాత్కాలిక ప్రణాళిక కింద వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రవాణాకు సంబంధించి యాప్ ద్వారానే బిల్లుల చెల్లింపులు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో ప్రధాన కూడళ్ల, ప్రతి సచివాలయాల ప్రాంతంలో వెంటనే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాయితీతో కూడిన రుణాల మంజూరుకు జిల్లాకు 563 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 14 నుంచి మే 10వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఈ విషయాన్ని మున్సిపల్, మండల స్థాయిల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఉపాధి హామీ నిధులతో జిల్లాలో పదివేల ఎకరాల్లో గడ్డి పెంపకం చేపట్టాలని, ప్రతి నియోజకవర్గంలో 1500 ఎకరాలు, ప్రతి మండలంలో 500 ఎకరాల్లో తప్పనిసరిగా గడ్డి పెంపకం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. అదేవిధంగా జిల్లాకు 1000 పశువుల నీటి తొట్టెల నిర్మాణం లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందన్నారు. ఇందులో ఇప్పటికే 176 నీటితొట్టెలను పూర్తి చేయగా మిగిలినవి ప్రగతిలో ఉన్నాయని, ఈనెల 14లోగా వాటిని పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్, పీఆర్ ఎస్ఈలు ప్రసన్నకుమార్, దయాకర్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రాజ్యలక్ష్మి, జీఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి, ఇన్‌చార్జి డీపీవో, ఎంపీడీవోలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

గుర్రంకొండ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని తరిగొండ సచివాలయంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ నాయకులు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తిరుపతికి చెందిన రమాదేవి ఆసుపత్రి వైద్యుల ఆధ్వర్యంలో అన్ని రకాల జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ క్రమంలో 200 మందికి వైద్య పరీక్షలను చేసి మందులను పంపిణీ చేశారు. అలాగే ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సురక్షిత ప్రసవంపై అవగాహన

నిమ్మనపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రసవం ప్రతి గర్భిణీ హక్కు అని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రహారం పంచాయతీలో జాతీయ సురక్షిత మాతృత్వ దినోత్సవం సందర్భంగా గ్రామస్తులకు 104 ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కిశోర బాలికలే రేపటి కాబోయే తల్లులని అందుకే వారు రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం లీలారాణి, ఆశాలు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

కలకడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ నల్లగుట్టపల్లె మర్రిమాను వద్ద గల దత్తాత్రేయ పీఠంలో శనివారం నుంచి సోమవారం వరకు విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా రామలింగేశ్వరస్వామి, ధ్వజనవగ్రహ, సత్యసాయిబాబా విగ్రహాలు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించబడతాయని తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

వైద్యం మరింత మెరుగుపడాలి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం మరింత మెరుగుపడాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో దాదాపు రూ.50 లక్షలతో నూతనంగా మంజూరైన అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పరుగులు పెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుధాకర్‌రావు, శ్రీపతి, రమణ, దేవేంద్రరెడ్డి, రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు

కలకడ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతిలో ప్రవేశానికి జరిగే పరీక్ష తేదీలో మార్పు జరిగిందని ప్రిన్సిపాల్ మలాంషావలి తెలిపారు. ప్రభుత్వం ముందుగా ప్రకటించిన తేదీకి బదులుగా మరుసటి రోజు 21వ తేది సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మార్పును గమనించి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పీలేరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సబ్-స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పీలేరు పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో ఏఈ ఖాదర్ ఇలాహీ తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

నిమ్మనపల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడులు, కళాశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ దొరుకుతుందని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాధాక్రిష్ణ, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి





జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బాస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజక వర్గాల్లో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికి, చిత్రపటాలకు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనచేసిన సేవలను కొనియాడారు.

● మదనపల్లెలో పూలే విగ్రహావిష్కరణ

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె మార్కెట్ యార్డు వద్ద జ్యోతిరావుపూలే విగ్రహాన్ని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, బోడెం రాజశేఖర్, కాంగ్రెస్ నేత రెడ్డిసాహెబ్, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌కుమార్ తదితరులు మాట్లాడారు. అలాగే స్థానిక కాలనీ గేటులోని బాస్ కార్యాలయంలో వ్యవస్థాపక అధ్యక్షుడు పీటీఎం శివప్రసాద్ జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలోనూ జయంతి వేడుకలు జరిగాయి.

బి.కొత్తకోటలో: మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని శుక్రవారం బి.కొత్తకోటలో ఘనంగా జరుపుకున్నారు. జ్యోతిచౌక్‌లో భారతీయ అంబేద్కర్ సేన ప్రతినిధులు, మండల రిసోర్స్ సెంటర్‌లో ఎంఈవో రెడ్డిశేఖర్‌ల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తంబళ్లపల్లె: స్వాతంత్ర్యం రాక ముందే సామాజిక సమస్యలపై తిరుగుబాటు చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని తంబళ్లపల్లె ఎంపీపీ పాఠశాల హెచ్ఎం రెడ్డప్పరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలల్లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఆనంద్, టీచర్లు వెంకట్రమణ, కవిత, పద్మావతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావ్ పూలే అని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ కొనియాడారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పీలేరులో: పూలే జయంతి శుక్రవారం పీలేరులో ఘనంగా నిర్వహించారు. బహుజన సంక్షేమ సంఘం, బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్, ఎంఆర్‌పీఎస్, బీసీ చైతన్య సమితి, బీసీ హక్కుల పోరాట సమితి, మాలమహానాడు, భారతీయ అంబేడ్కర్ సేన, బిస్మిల్లా ఆటో యూనియన్, రాష్ట్ర పంచాయతీ కార్మికుల సంఘం, ఎన్ఎస్‌యూఐ నాయకులు జయంతిని నిర్వహించారు.

వాల్మీకిపురంలో: మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను శుక్రవారం వాల్మీకిపురంలో బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు జరుపుకున్నారు.



పీలేరులో.. పూలే విగ్రహానికి నివాళులు

కనుల పండువగా రామయ్య రథోత్సవం



కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కురబలకోట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోటలో వెలసిన కోదండరామస్వామి రథోత్సవ వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన తిరుణాల శుక్రవారం సాయంత్రం ముగిసింది. రథోత్సవ వేడుకల సందర్భంగా భక్తుల గోవిందనామ స్మరణలతో మార్మోగింది. ఈ తిరుణాలకు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన భక్తులతో పాటుగా కర్నాటకకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో కిటకిలాడింది. కాగా గురువారం రాత్రి గరుడోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకల్లో తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ నిర్వాహకులు రాజారెడ్డి, హేమంత్‌రాజ్ తదితరులు స్వాగతం పలికారు. అలాగే పలువురు భక్తులు చలివేంద్రాలను ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నాణ్యత మార్గదర్శకాలను విధిగా పాటించాలి

పీలేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉత్పత్తుల భద్రత, నాణ్యతా ప్రమాణాలను విధిగా పాటించాలని నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్‌డీడీబీ) తిరుపతి రీజియన్ క్వాలిటీ హెడ్ సంగయ్య శ్రీజ డైయిరీ సిబ్బందికి సూచించారు. శ్రీజ డైరీ బీఎంసీయూ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, క్వాలిటీ కెమిస్టులకు ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టంపై శుక్రవారం ఆయన స్థానిక వెలుగు కార్యాలయంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు జవహర్, దేవసేన, అనూరాధ, శ్రీజ డైయిరీ తిరుపతి జోనల్ హెడ్ శేఖర్ రెడ్డి, ఏవోలు శివకుమార్, అమరలింగారెడ్డి, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్‌లు తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంప్‌పై స్థానికుల అభ్యంతరం

పీలేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పీలేరు-మదనపల్లె మార్గంలోని ఈద్గాహ్‌కు ఆనుకుని ఉన్న చెన్నకేశవస్వామి ఆలయ భూముల్లో పంచాయతీ సిబ్బంది చెత్తను డంప్ చేయడంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈద్గాహ్‌కు ఆనుకుని ఉన్న సుమారు 3 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం కోర్టు ప్రాంగణం కోసం కేటాయించింది. అక్కడ ఎటువంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో కొంత మంది పంచాయతీ పారిశుధ్య ట్రాక్టర్ల డ్రైవర్లు అక్కడ చెత్తను డంప్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఈవో గురుమోహన్ మాట్లాడుతూ కొంత మంది డ్రైవర్ల కారణంగా సమస్య ఉత్పన్నమైందని, త్వరలోనే అక్కడి నుంచి చెత్తను ఎత్తివేస్తామన్నారు.

కోర్టులో గంగమ్మకు విశేష పూజలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టులో వెలసిన గంగమ్మకు శుక్రవారం ఆలయకమిటీ ప్రత్యేక అలంకరణలో విశేషపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకుడు సుష్మిత్ పుష్పాలతో అలంకరణ చేసి అమ్మవారిని భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మహిళలు రాహుకాల సమయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మకు చీర, జాకెట్లు, పొంగళ్లు నైవేద్యం సమర్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు చిన్న రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, కార్యదర్శి ప్రభాకర్ నాయుడు తదితరులు పర్యవేక్షించారు.

కంప్యూటర్ విద్యపై పట్టు సాధించాలి

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): డిగ్రీ విద్యార్థులు కంప్యూటర్ విద్యలో కొత్త ఆవిష్కరణలపై పట్టు సాధించాలని కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ క్లబ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఏఐ ట్రెండ్ నడుస్తోందని, దీని ద్వారా విద్యార్థులు కొంగొత్తగా ఆలోచించి కంప్యూటర్ విద్యపై అవగాహన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయి

పీలేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు రేపు రెండవ శనివారం యథాప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతాయని పీలేరు సబ్ రిజిస్ట్రార్ శివకుమారి తెలిపారు. గురువారం ఆమె పీలేరులో విలేకరులతో మాట్లాడుతూ హాలిడే ఫీజు మినహాయిస్తూ కేవలం స్టాంప్ డ్యూటీ ఫీజు, రిజిస్ట్రేషన్లతో ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని క్రయ, విక్రయదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

సమావేశం విజయవంతం చేయండి

పెద్దమండ్యం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యంలో శనివారం జరగనున్న మండల బీజేపీ కార్యకర్తల సమావేశం విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం పెద్దమండ్యంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి మండల బీజేపీ నాయకులు తరలిరావాలని కోరారు.

కమనీయంగా పట్టాభిరాముల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో వెలసిన పట్టాభిరాముల శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీపట్టాభిరాముల వారి కల్యాణోత్సవం కమనీయంగా కనుల పండువగా సాగింది. శుక్రవారం స్వామి వారు ఉదయం సింహవాహనంలో పురవీధుల్లో విహరించారు. శుక్రవారం కందుకూరులో వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ మేళతాళాలు, మంగళవాయిద్యాలు వేదపండితుల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామి వారిని సుందరంగా అలంకరించి స్వామి అమ్మవార్లకు పుష్పమాలికలు, స్వర్ణాభరణాలు అలంకరించి కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు అశేష భక్తులు హాజరై తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణ మహోత్సవ అనంతరం స్వామి అమ్మవార్లు పురవీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అశేష జనవాహిని నడుమ స్వామివారు వివిధ రకాల అలంకరణల్లో విహరించారు.

బడుల మూతను మానుకోవాలి

● యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి

పీలేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అధికారుల వత్తిడితో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను బలవంతంగా మూసివేయాలన్న ఆలోచనను మానుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన పీలేరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యాశాఖ ఉన్నతాధికారులు బలవంతంగా ప్రాథమిక పాఠశాలలు మూయించాలని ప్రధానోపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీలపై తీవ్ర వత్తిడి తీసుకురావడం శోచనీయమన్నారు. తద్వారా పేద విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఓ రైతుకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును చోరీ చేసి తీసుకెళ్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానిక పులికల్లుకు చెందిన బల్లాపురం సావిత్రమ్మ అనే మహిళా రైతు అందించిన సమాచారం మేరకు వివరాలిలా.. పులికల్లు సమీపంలోని తమ పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి అందులో ఉన్న రాగి వైరును దోచుకెళ్లారని తెలిపారు.

'రైల్వేలైను పునరుద్ధరణకు కృషి చేయండి'

పీలేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కడప-బెంగళూరు రైల్వే లైను పునరుద్ధరణకు కృషి చేయాలని పీలేరు ఎన్టీఆర్ కళాక్షేత్రం అధ్యక్షుడు నఫీస్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు రాజమండ్రి ఎంపీ, దగ్గుబాటి పురందేశ్వరికి విజ్ఞప్తి చేశారు. ఈ రైల్వే మార్గం ద్వారా రాయలసీమ ప్రాంతంలో విస్తృతంగా పండే మామిడి, అరటి, బత్తాయి, టమోటా పంటలను బెంగళూరుకు నేరుగా తీసుకెళ్లి విక్రయించుకునే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పనుల పునరుద్ధరణకు చొరవ చూపాలని కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విజయవాడలో ఎంపీని కలిసి వినతిపత్రం అందజేశారు.



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న నఫీస్

రెండో రోజూ కొనసాగిన ధర్నా



ఆర్టీసీలో ధర్నా నిర్వహిస్తున్న ఎన్ఎంయూ నాయకులు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండో రోజూ స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గేట్ ధర్నాను నిర్వహించారు. డిపో కార్యదర్శి రెడ్డిబాషా, బాబ్జీ, సీసీఎస్ఎంసీ మెంబర్ వినోద్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్యం సౌకర్యం కల్పించాలని, సీఆర్‌బీఎస్ సంక్షేమపథకం అమలు చేయాలని, గ్యారేజ్‌లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 2 డిపో అధ్యక్షుడు మునికృష్ణ, రాధాకృష్ణ, సుధాకర్, నగరిమడుగు రమణ, శ్రీనివాసులు, ఎంఆర్‌బాబు, 2 డిపో గ్యారేజ్ కార్యదర్శి బావజాన్, చలం, ఆచారి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు



కొత్త రకం వరి పంటలను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

నిమ్మనపల్లి, ఏప్రిల్ 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని స్థానిక పంచాయతీ నాగంవారిపల్లిలో ఎన్.ఎల్.ఆర్-3648 వరి రకాన్ని కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి శాస్త్రవేత్తలు పీరుసాబ్, సోమశేఖర్ బాబు, ఏవో మురళిమోహన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవరి నెలలో ఇద్దరు రైతలకు కొత్త రకం ఎన్.ఎల్.ఆర్-3648 వరి వంగడాలను చిరు సంచుల ద్వారా అందించామన్నారు. కాగా రైతులు పండించిన కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు పరిశీలించి తగిన సలహాలు సూచలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

అవినీతి వీఆర్‌వోను సస్పెండ్ చేయాలి

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మండలం కొత్తవారిపల్లె-1 వీఆర్‌వోగా పనిచేస్తున్న భరత్ అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్రకు మాలమహానాడు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పాసుపుస్తకాల కోసం దరఖాస్తు చేస్తే వేళల్లో డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆయన అవినీతిపై ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేసి విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు వై.చంద్రయ్య, మోహన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భరత్ అవినీతికి అంతులేకుండా పోయిందని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ సబ్‌కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్రకు ఫిర్యాదు చేశారు. బీవైఎస్ నాయకులు సురేష్, శశికుమార్, ఆదినారాయణ, హరి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ



పారిశుధ్య కార్మికులకు సామగ్రి పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మదనపల్లె, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు శుక్రవారం సామగ్రి పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, వైస్ చైర్మన్ జింకా వెంకటాచలపతిలు సామగ్రి అందజేశారు. గతేడాది సెప్టెంబరులో విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో పారిశుధ్య పనులు చేపట్టిన 40 మందికి ఒక్కొక్కరికి ఆరు మీటర్ల చొప్పున ఖాకీ యూనిఫాం, 161 మంది మహిళా కార్మికులకు మూడు చీరలు తదితర వాటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ డీఈ శ్రావణి, ఏఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 41వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, బోధనలు వున్నాయన్నారు. ఈ కళాశాలలో 800 వున్న విద్యార్థుల సంఖ్యను 2వేలకు పెంచాల్సిన ఆవశ్యకత వుందన్నారు. ఈ కళాశాలకు సావిత్రి భాయి పూలే కళాశాలగా పేరు మార్పునకు కృషి చేస్తానన్నారు. అనంతరం చదువులో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి, రిటైర్డ్ ప్రిన్సిపల్ సుగుణమ్మ, చంద్రశేఖర్, అజ్‌బహల్ ట్రస్టు అధ్యక్షుడు ఎం.ఏ.బాషా, అధ్యాపకులు మోహనవల్లి, ఖాజావలి, గురుమూర్తి, వనజ, సూర్యశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ మహమూద్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. గత మండల సమావేశం ఎంతో హాట్‌హాట్‌గా జరిగిన నేపథ్యంలో ఈ మండల సమావేశం రసాభాసగా జరుగుతుందని పలువురు భావించారు. కానీ సమావేశం సాదాసీదాగా జరిగిపోవడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సమావేశానికి పలువురు సర్పంచ్‌లు డుమ్మాకొట్టారు. వచ్చిన కొద్దిపాటి సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం పలు సమస్యలపై అడిగారు. సమావేశంలో ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్, ఎంపీపీ మహమూద్ వైస్ ఎంపీపీ శోభ, జడ్పీటీసీ శివన్న, ఎస్ఐ హరిహరప్రసాద్‌తో పాటు కూటమి నాయకులు బూర్లపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి, కట్టా సురేంద్రనాయుడు, బూర్లపల్లె సుధాకర్‌రెడ్డితో పాటుగా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు నిలిపివేసిన రెవెన్యూ సిబ్బంది

పీలేరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ పరిధిలోని సర్వే నెం.2022లోని వంక పొరంబోకు, వక్ఫ్ స్థలంలో జరుగుతున్న ఇంటి నిర్మాణాన్ని శుక్రవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. ఆ స్థలంలో అక్రమంగా ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు అందడంతో తహసీల్దారు భీమేశ్వరరావు తన సిబ్బందితో నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ రికార్డుల మేరకు నిర్మాణాలు జరుగుతున్న స్థలం వంక పొరంబోకు, వక్ఫ్ స్థలం కిందకు వస్తుందని, ఆ స్థలాల్లో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని ఆయన నిర్మాణదారులను హెచ్చరించి పనులు నిలిపివేశారు. తమ వద్ద ఉన్న రికార్డులతో తన కార్యాలయంలో సంప్రదించాలని వారిని ఆదేశించారు.

బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

పీలేరురూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్ర ప్రభుత్వం లేదా ఆర్టీసీ సంస్థ కొనుగోలు చేయాలని ఎన్ఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ఎం రాజు డిమాండ్ చేశారు. శుక్రవారం పీలేరు ఆర్టీసీ గ్యారేజ్ వద్ద ఎన్ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండవ రోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జోనల్ నాయకులు ఖాజాపీర్, ఆనంద్, నాయుడు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు సీవీ రమణ, ఆదినారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.